సాక్షి తిరుపతి

సోమవారం । 24 । మార్చి । 2025



చంద్రగిరి 'కూటమి'లో విభేదాలు
చంద్రగిరిలో ఆదివారం నిర్వహించిన జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి టీడీపీ, జనసేన నేతలు డుమ్మా కొట్టారు. - 8లో



అనధికార హాకర్ల తరలింపు
తిరుమలలోని అనధికార హాకర్లు, కూలీలు, అనుమానితులను పోలీసులు ఆదివారం తిరుపతికి తరలించారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం (సా)	సహర్ మంగళవారం (ఉ)
తిరుపతి	6-27	4-55
గూడూరు	6-21	4-50

న్యూస్‌రీల్

పోరాట స్ఫూర్తి భగత్‌సింగ్



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, అభినయ్‌రెడ్డి తదితరులు

తిరుపతి మంగళం : భరతజాతి మరువలేని పోరాట స్ఫూర్తి భగత్‌సింగ్ అని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. ఆదివారం తిరుపతి పద్మావతిపురంలోని భూమన నివాసం వద్ద భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. భూమన మాట్లాడుతూ 1931 మార్చి 23వ తేదీన దేశం కోసం భగత్‌సింగ్ సగర్వంగా ఉరికంబం ఎక్కారన్నారు. భగత్‌సింగ్‌తోపాటు రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని వెల్లడించారు. ఈ క్రమంలోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ, నేతలు లవ్‌లీ వెంకటేష్, మద్దాలి శేఖర్, పసుపులేటి సురేష్, సుబ్బు, రుద్రగోపి, పుణీత పాల్గొన్నారు.

ఏప్రిల్ 10న మిక్స్‌డ్ బియ్యానికి టెండర్ కమ్ వేలం

తిరుపతి కల్చరల్ : తిరుమల శ్రీవారికి భక్తులు సమర్పించిన మిక్స్‌డ్ బియ్యం టెండర్ కమ్ వేలాన్ని ఏప్రిల్ 10వ తేదీన నిర్వహించనున్నట్లు టీటీడీ సీపీఆర్ఓ రవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని మార్కెటింగ్ విభాగం కార్యాలయంలో ఈ మేరకు వేలానికి మొత్తం 12,320 కిలోల బియ్యాన్ని సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఆసక్తిగలవారు రూ.590 డీడీ తీసి టెండర్ షెడ్యూల్ పొందవచ్చని సూచించారు. వేలంలో పాల్గొనేందుకు రూ.25వేలను ఈఎండీగా చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయం, లేదా, 0877–2254429 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



ఏనుగులు తొక్కేసిన వరి పైరు

భాకరాపేట : ఎర్రావారిపాళెం మండలం నెరబైలు పరిసర ప్రాంతాల్లో ఏనుగుల విధ్వంసం కొనసాగుతోంది. రెండు రోజులుగా ఏనుగులు పంటలన నాశనం చేస్తున్నాయి. శనివారం రాత్రి ఈ మేరకు వరి, మామిడి పంటలన తొక్కి ధ్వంసం చేశాయి. అటవీ అధికారులు స్పందించి గజరాజులను అటవీప్రాంతంలోకి మళ్లించాలని రైతులు కోరుతున్నారు.

మోసం గురో..!

పెట్రోల్ పట్టించుకునేందుకు బంకు వద్దకు వెళ్లగానే.. జీరో చూసుకోండి సర్.. అంటూ అక్కడి సిబ్బంది వినయంగా సూచిస్తారు. వాహనంలో నిఖార్సుగా ఇంధనం నింపుతున్నట్లు కనిపిస్తారు. డిజిటల్ మీటర్‌లో పక్కాగా కొలత చూపించి.. తమంతటి నిజాయితీపరులు ఎక్కడా ఉండరు అన్నట్లు ఫోజు కొడతారు. ఈ క్రమంలోనే వినియోగదారుడి జేబుకు చిల్లు పెట్టేస్తారు. ప్రతి లీటర్‌లో 50 మి.లీ నుంచి 100 మి.లీ తక్కువగా ట్యాంకులోకి ఆయిల్ పడతారు. వాహనదారుడి కళ్లెదుటే యథేచ్ఛగా మోసానికి పాల్పడుతుంటారు. ఇదే తంతు జిల్లాలోని దాదాపు అన్ని పెట్రోల్ బంకుల్లో నిత్యకృత్యంగా మారిపోయింది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో బంకు నిర్వాహకుల దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఆయిల్ నాణ్యతను అనుమానించిన కస్టమర్లకు అవమానమే ఎదురవుతోంది. పెట్రోల్ బంకుల్లో అక్రమాలపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని దుస్థితి వాహనదారులను వేధిస్తోంది.





చిట్టమూరులోని పెట్రోల్ బంకు

జిల్లా సమాచారం

మొత్తం పెట్రోల్ బంకులు	90
గత 9 నెలల్లో అధికారులు చేపట్టిన తనిఖీలు	190
నమోదు చేసిన కేసులు	02
విధించిన జరిమానా	రూ.1.5 లక్షలు



తిరుపతిలోని పెట్రోల్ బంక్

పెట్రోల్ బంకుల్లో యథేచ్ఛగా చీటింగ్

- దోపిడీ గన్‌తో రీడింగ్ మాయ
- కల్తీ ఇంధనంతో వాహనదారులకు ఝలక్
- లిట్మస్ పరీక్ష అడిగితే ససేమిరా అంటున్న సిబ్బంది
- తూతూమంత్రంగా తనిఖీలు చేపడుతున్న అధికారులు
- జిల్లావ్యాప్తంగా కొరవడిన పర్యవేక్షణ
- కూటమి ప్రభుత్వంలో ఇప్పటి వరకు కేవలం రెండే కేసులు
- డిజిటల్ మీటర్ నుంచి ఆయిల్ నాణ్యత వరకు అవకతవకలే

'సాక్షి' పరిశీలనలో వెలుగు చూసిన వాస్తవాలు

- తిరుచానూరు రోడ్డులోను ఓ పెట్రోల్ బంకులో తక్కువ ఇంధనం పడుతున్నట్లు నాగలక్ష్మి అనే వాహనదారు తెలిపారు.
- తిరుపతి అలిపిరి రోడ్డులోని ఓ బంక్‌లో పెట్రోల్ పడితే 10–15 కిలోమీటర్లకు ముందే రిజర్వ్ పడిందని దామోదర్ అనే ద్విచక్రవాహనదారుడు వాపోయారు.
- తిరుపతి లీలామహల్ రోడ్డులోని ఓ బంక్‌కు వెళ్లి వాటర్ బాటిల్‌లో లీటర్ పెట్రోల్ పడితే 950 మిల్లీలీటర్లే ఉందని మరో బాధితుడు రమేష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి రూరల్ ప్రాంతంలోని హైవేపై బంకుల్లోనూ ఇదే పరిస్థితి ఉందని పలువురు వాపోతున్నారు.



నాగలాపురంలో..

- శ్రీకాళహస్తిలో వాటర్ బాటిల్‌లో పట్టుకుంటే లీటర్‌కు 50 మిల్లీలీటర్లు తక్కువ ఉంటోందని,



వెంకటగిరి..

అదే వాహనానికి అయితే లీటర్‌కు 100 మిల్లీలీటర్ల తగ్గించి పడుతున్నారని బాలాజీ అనే మోటారుసైకిలిస్టు ఆరోపించారు.

- వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట,సత్యవేడు నియోజకవర్గాల్లోని పెట్రోల్ బంకుల్లో ఇదే విధంగా మోసాలకు పాల్పడుతున్నారని వాహనదారులు మండిపడుతున్నారు.

తిరుపతి అర్బన్/తిరుపతి సిటీ: జిల్లావ్యాప్తంగా మోటారు వాహనాల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. సామాన్యులు సైతం బైక్ లేనిదే ఇంటి నుంచి బయటకు రావడం లేదు. ఈ–బైక్‌లు అందుబాటులోకి వచ్చినా ప్రజలు ఇప్పటికీ పెట్రోల్‌తో నడిచే ద్విచక్ర వాహనాలపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. వినియోగదారుల అవసరాలను పెట్రోల్ బంకుల నిర్వాహకులు అవకాశంగా మార్చుకుంటున్నారు.

జంప్ ట్రిక్!

జిల్లాలో 90 పెట్రోల్ బంకులు ఉన్నాయి. కొన్ని బంకుల్లో 'జంప్ ట్రిక్' మోసానికి పాల్పడుతున్నారు. పెట్రోల్ పట్టేప్పుడు అక్కడి సిబ్బంది డిజిటల్ మీటర్‌లో జీరో చూసుకోండి అని చెబుతుంటారు. పెట్రోల్ పోయడం మొదలుపెట్టగానే మీటరు నెమ్మదిగా పెరగకుండా ఒక్కసారిగా 10–20 పాయింట్లకు వెళ్లిపోతుంది. దీంతో మనకు తక్కువ పెట్రోల్ పోసినా, మీటరులో కరెక్ట్‌గా ఉన్నట్టే చూపిస్తుంది. సాధారణంగా మీటరు 4–5 పాయింట్లు మాత్రమే జంప్ అవ్వాలి. జిల్లాలోని అనేక బంకుల్లో ఈ తరహా మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఒకవేళ ఎవరైనా ఇది గమనించి అడిగినా.. పెట్రోల్ బంకు సిబ్బంది నుంచి స్పందన లేదని వాహనచోదకులు మండిపడుతున్నారు.

వసతులు కరువు

పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులకు కనీస వసతులు కల్పించడం లేదు. నిబంధనల ప్రకారం ప్రతి బంకు వద్ద మరుగుదొడ్లు, ఉచితంగా గాలి పట్టే పంపులు, తాగునీటి సదుపాయాలు కల్పించాల్సి ఉంది. 20 శాతం బంకుల్లో మినహా మిగిలిన చోట్ల అస్సలు సౌకర్యాలే ఉండడం లేదు. కనీసం జాతీయ రహదారి వెంబడి ఉన్న బంకుల్లోనూ తూతూమంత్రంగా వసతులు ఉన్నాయని వాహనాదారులు విమర్శిస్తున్నారు.

సార్.. జీరో చూసుకోండి!

సాధారణంగా వాహనదారులు పెట్రోల్ బంకుకు వెళ్లి.. ఇంధనం పోయాలని అక్కడికి సిబ్బందికి ఆడిగిన వెంటనే... వారు సార్ 'జీరో చూసుకోండి' అని ఎంతో నమ్మకంగా చెబుతారు. మన దృష్టి కూడా ఆ 'సున్నా'పైనే ఉంటుంది. జీరో ఉన్నంత మాత్రాన మనం మోసపోమనుకుంటే అది పొరపాటే. బంకుల్లో ఎప్పటికప్పుడు నయా మోసాలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. వినియోగదారులు నష్టపోతూనే ఉన్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం.. వినియోగదారులు సైతం దీనిపై పెద్దగా దృష్టి సారించకపోవడంతో జిల్లాలో పెట్రోల్ బంకుల నిర్వాహకులు యథేచ్ఛగా దోపిడీకి తెరతీస్తున్నారు.



కనీస వసతులు లేని మల్లవరం పెట్రోల్ బంక్

ఫిర్యాదు ఇలా..

పెట్రోల్ బంకుల్లో మోసాలు గమనిస్తే నిరభ్యంతరంగా ఫిర్యాదు చేయవచ్చు. సదరు మండలంలోని సివిల్ సప్లయ్ అధికారి లేదా, జిల్లా సివిల్ సప్లయి అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. అలాగే తూనికలు,కొలతల అధికారులకు సమాచారం అందించవచ్చు. అయినప్పటికి న్యాయం జరగకపోతే జిల్లా వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించవచ్చు. పెట్రోల్ బంకుల్లో సదుపాయాలు లేకపోయినా, సిబ్బంది దురుసుగా ప్రవర్తించిన చమురు సంస్థలకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

లిట్మస్ పరీక్షా...ఎక్కడ..?

సాధారణంగా పెట్రోలు నాణ్యతపై వినియోగదారులకు ఏమైనా సందేహాలు ఉంటే లిట్మస్ పేపర్‌తో పరీక్ష చేసి చూపాలి. ఈ పరీక్షలో నలుసులు, దుమ్ము సైతం కనిపించకుడదు. అయితే ఆ పరీక్షను చేసేవారు లేరు. చాలమందికి ఆ పరీక్షపై సరైన అవగాహన లేకపోవడం గమనార్హం.

వెంటనే చర్యలు



పెట్రోల్ బంకుల్లో మోసాలు, వసతులకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు చేపడుతున్నాం. ఆయా పెట్రోల్ బంకులను తనిఖీలు చేస్తున్నాం. మండలస్థాయి సివిల్ సప్లయి అధికారులను నిత్యం పెట్రోల్ బంకులపై నిఘా పెట్టమని చెప్పాం. తరచూ తనిఖీలు చేపడుతున్నాం. వినియోగదారులకు సమస్య వస్తే మా దృష్టికి తీసుకురావాలి. తప్పు చేసిన పెట్రోల్ బంకులపై చర్యలు తీసుకుంటాం.
– శేషాచలం రాజు, జిల్లా సివిల్ సప్లయి అధికారి

తనిఖీలు చేస్తున్నాం



పెట్రోల్ బంకులపై ఫిర్యాదులు వచ్చినా రాకున్నా తరచూ తనిఖీలు చేస్తున్నాం. తొమ్మిది నెలల్లో 200 సార్లు తనిఖీలు చేపట్టాం. రెండు కేసులు నమోదు చేశాం. వారికి రూ.1.5లక్షల జరిమానా విధించాం. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే ఆ పెట్రోల్ బంకులపై ప్రత్యేక నిఘా పెడతాం. కొందరు వాటర్ బాటిల్‌లో పట్టుకుంటే తేడా లేదని..వాహనానికి పట్టుకుంటే తేడా ఉన్నట్లు చెబుతున్నారు. ఏదైనా ఒకేలా ఉంటుంది...అలాంటి తేడాలు ఉండవు.
– సి.స్వామి, కొలతలు, తూనికల శాఖ జిల్లా సహాయ కమిషనర్

ఏపీఓల బదిలీ

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : చంద్రగిరి నియోజకవర్గంలో నలుగురు ఏపీఓలు ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఉపాధి పనుల్లో యథేచ్ఛగా జరిగిన అవినీతి ఇటీవల నిర్వహించిన సామాజిక తనిఖీల్లో బట్టబయలైన విషయం విధితమే. ఈ క్రమంలోనే ఏపీఓలపై కలెక్టర్ వెంకటేశ్వర్ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. శనివారం ఈ మేరకు డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. వడమాల పేటలో ఏపీఓ సునీతను రామచంద్రాపురానికి, ఇక్కడ పనిచేస్తున్న ఏపీవో హంసవేణిని వడమాలపేటకు బదిలీ చేశారు. అలాగే రేణిగుంట నుంచి జ్యోతిశ్రీని తిరుపతి రూరల్ మండలానికి, ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న మమతను పుత్తూరుకు బదిలీ చేశారు. పుత్తూరు నుంచి భార్గవిని చంద్రగిరికి, ఇక్కడ పనిచేస్తున్న జ్యోతిని బాలాయపల్లికి, అక్కడి నుంచి ఆషారాణిని పాకాలకు, పాకాలలో విధులు నిర్వర్తిస్తున్న కల్యాణిని తొట్టంబేడు మండలానికి బదిలీ చేశారు. అయితే ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు ఏపీఓలను బదిలీ నుంచి మినహాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధి హామీ పథకం కింద అత్యధికంగా పనులు జరిగిన ఆ రెండు మండలాల్లో అవినీతి వెలుగుచూసినప్పటికీ వారిపై చర్యలు తీసుకోక పోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 75,428 మంది స్వామిని దర్శించుకున్నారు. 31,920 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి హుండీ ద్వారా రూ.3.40 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లున్న భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే వెంకటగిరి



కౌన్సిలర్లతో మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి (సైదాపురం): వెంకటగిరి మున్సిపాల్టీలో వైఎస్సార్‌సీపీ పాలనే ఉంటుందని, పురపాలక సంఘం చైర్మన్‌గా నక్కా భానుప్రియ కొనసాగుతారని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌జేఆర్ భవనంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత మున్సిపల్ ఎన్నికల్లో జగనన్న ఎంపిక చేసిన అభ్యర్థులు వైఎస్సార్‌సీపీ బీఫామ్‌తో మొత్తం 25వార్డుల్లోనూ విజయబావుటా ఎగురవేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత టీడీపీ నేతలు కొందరు కౌన్సిలర్లును లోబర్చుకునేందుకు యత్నించినట్లు ఆరోపించారు. ప్రస్తుతం టీడీపీకి ఒక్క కౌన్సిలర్ కూడా లేరని, అయినప్పటికీ అసత్య ప్రచారంతో 16 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లతో సంతకాలు చేయించుకుని అవిశ్వాస తీర్మానానికి కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే ఏప్రిల్ 9వ తేదీన వెంకటగిరి మున్సిపాల్టీలో అవిశ్వాస తీర్మాన ప్రవేశపెట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. దీనిపై 18 మంది కౌన్సిలర్లతో ప్రత్యేకంగా మాట్లాడామని, వారిలో ఏ ఒక్కరూ పార్టీని వీడేందుకు సుముఖంగా లేరని స్పష్టం చేశారు. టీడీపీ నేతలు దుర్మార్గపు ఆలోచనలతో తీసుకువచ్చిన అవిశ్వాస తీర్మానంలో నక్కా భానుప్రియ అఖండ విజయం సాధించి మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగుతారని వెల్లడించారు.

సత్యం సారథ్యంలోనే సీతమ్మ ట్రస్ట్

తిరుపతి తుడా : పంగులూరి సీతమ్మ ట్రస్ట్ భూముల నిర్వహణ పామిడి సత్యనారాయణ శెట్టి సారథ్యంలోనే సాగుతాయని తిరుపతి ఆర్యవైశ్య సంఘం, మహానగర ఆర్యవైశ్య సంఘం ఆదివారం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేసింది. సత్యనారాయణ కమిటీని సస్పెండ్ చేస్తూదేవదాయశాఖ జారీ చేసిన ఉత్తర్వులు చెల్లవని పేర్కొంది. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని తెలిపింది. సీతమ్మ ఆర్యవైశ్య ధర్మసత్రం ట్రస్ట్‌కు అధ్యక్షుడిగా సత్యనారాయణ కొనసాగుతారని వెల్లడించింది. ఈ క్రమంలోనే కన్యకా పరమేశ్వరి ఆలయ పాలకమండలి గౌరవాధ్యక్ష పదవి నుంచి పసుపర్తి గోపీనాథ్‌ను, ఉపాధ్యక్ష పదవి నుంచి ఫణిసాగర్‌ను తొలగిస్తూ కమిటీ ఏకగ్రీవ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేసింది.

కార్యదర్శుల పంచాయితీ

సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులు పని ఒత్తిడితో తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. సర్వేలతో ప్రాణాలు పోతున్నాయని ఆవేదన చెందుతున్నారు. విధుల భారం తగ్గించండి సార్ అంటూ కనిపించిన అధికారులందరికీ వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పదుల సంఖ్యలో అప్పగించిన సర్వేలతో సతమతమవుతున్నారు. సెలవు రోజుల్లో సైతం సేదతీరే అవకాశం లేకుండా పోయిందని వాపోతున్నారు.

- 39 రకాల పనుల భారం
- సర్వేలతో సతమతం
- ఒత్తిడికి చిత్తవుతున్న ఉద్యోగులు



సర్వేలకు సిద్ధం అవుతున్న పంచాయతీ కార్యదర్శులు (ఫైల్)

తిరుపతి అర్బన్ : సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులు కాస్తా.. సర్వే ఉద్యోగులుగా మారిపోయారు. గతంలో సచివాలయంలో ఉంటూ 200లకు పైగా సేవలు అందించేవారు. అయితే కూటమి సర్కార్‌లో వారు కేవలం సర్వేలకే పరిమితం అయ్యారు. నిత్యం ఇంటింటికి వెళ్లి ఏదో ఒక్క సర్వే చేయాల్సి వస్తుంది. దీంతో పనిభారం పెరిగిపోతోందని ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోతోంది. స్టేట్ పాలసీ కాబట్టి సర్వే చేయాల్సిందేనని అధికారులు చేతులెత్తేస్తున్నారు. రోజుకు 30 నుంచి 80 ఇళ్ల సర్వే చేయాల్సిన వస్తోందని వాపోతున్నారు. ఉదయం 6 గంటలకు యాప్స్ తెరిచి హాజరు నమోదు చేయడంతో మొదలై నిర్ణీత లక్ష్యం చేరుకునే వరకు సమయంతో పని లేకుండా సర్వేల్లోనే నిమగ్నమవుతున్నారు. ఈ క్రమంలోనే రోజు వారీ విధులు, సోమవారం గ్రీవెన్స్, మరోవైపు ఉన్నతాధికారుల జూమ్ మీటింగ్‌లు, ఫోన్ కాన్ఫరెన్సులతో క్షణం తీరిక లేకుండా పోతోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

తీవ్రంగా ఒత్తిడి



పంచాయతీ కార్యదర్శులకు తీవ్రంగా పని ఒత్తిడి ఉంది. దీంతో పలువురు అనారోగ్యం బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా ప్రకాశం జిల్లాలో ఓ పంచాయతీ కార్యదర్శి గుండె పోటుతో మృతి చెందారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారు సీరియస్‌గా తీసుకోవడం లేదు. దీంతో ఉద్యోగు నానా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. దీనిపై రాష్ట్ర స్థాయిలో పోరాటం చేయక తప్పదని భావిస్తున్నాం.
– వెంకట్రావు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్, సచివాలయ ఉద్యోగుల సంఘం

మనుషులం కాదా..?



పంచాయితీ కార్యదర్శులు మనుషులు కాదా...? యంత్రం వలే పనిచేయాలని బాధ్యతలు కట్టబెట్టేస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు 40కి పైగా పనులు చేపట్టాల్సి ఉంది. ఇది ఎలా సాధ్యం అవుతుంది. ముందే ఉద్యోగుల కొరత ఉంది. దీంతో మరింత భారంగా మారుతోంది. మా పరిస్థితులను ఉన్నతాధికారులకు చెబితే స్టేట్ పాలసీ అంటున్నారు. మా కష్టాలను గుర్తించి పని భారం తగ్గించాలని కోరుతున్నాం.
– హరిబాబు, పంచాయతీ సెక్రటరీ

ఇంటింటికీ వెళ్లాలి



పంచాయతీ కార్యదర్శులకు సర్వేల భారం తప్పడం లేదు. కార్యాలయంలో ఉండాల్సిన పనిలేకుండా ప్రతి రోజు ఇంటింటికి వెళ్లాల్సి ఉంది. కొన్ని సర్వేలకు ప్రజల నుంచి ఓటీపీలు తీసుకోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో కొందరు ఓటీపీ చెప్పడానికి ఇష్టపడడం లేదు. అయితే ఉన్నతాధికారులు మాత్రం తప్పకుండా ఓటీపీలు నమోదు చేయాలంటున్నారు. దీంతో తీవ్రంగా ఇబ్బందిపడుతున్నాం. మా బాధలను ఎవరూ పట్టించుకోవడం లేదు. – వెంకట కిషోర్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, సచివాలయ ఉద్యోగుల సంఘం

తప్పు జరిగితే షోకాజ్



పనులు చెప్పడం..ఆ తర్వాత చిన్నపాటి తప్పుడు జరిగినా షోకాజ్ నోటీసులు ఇస్తున్నారు. నిత్యం చెత్త తొలగింపుపై నిఘా పెడుతున్నాం. చెత్త విషయం అందరికీ తెలిసిందే ఏ క్షణం ఎవరురూ చెత్త ఎక్కడ వేస్తారోనని మాకు ఆందోళనగా ఉంటుంది. చెత్త కనపడితే మీకు నోటీస్ తప్పదు అంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఉద్యోగం చేయడమే కష్టంగా ఉంటోంది. ఉన్నతాధికారులు మా సమస్యలపై స్పందించి న్యాయం చేయాలి.
– అనిల్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ

వెంకన్నా మమ్మల్ని ఆదుకో స్వామి

- శ్రీవారి మెట్టు వద్ద చిరు వ్యాపారుల వేడుకోలు



అలిపిరి పాదాల మండపం వద్ద కొబ్బరి కాయలు కొడుతున్న చిరు వ్యాపారులు

తిరుపతి కల్చరల్ : న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 216 రోజులుగా దీక్ష చేస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని చిరు వ్యాపారులు వాపోయారు. వారు ఆదివారం 'మా సమస్యలు నీవైనా పరిష్కరించు స్వామీ' అని ఏడు కొండల వాడిని మొక్కుకున్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర వ్యాపారులతో కలిసి శ్రీవారి చిత్రపటాన్ని నెత్తిన పెట్టుకొని అలిపిరి పాదాల మండపం వద్ద పూజలు చేశారు. కొబ్బరి కాయలు సమర్పించారు. జయచంద్ర మాట్లాడుతూ శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు సమస్యలు పరిష్కరించాలని దీక్షలు చేస్తున్నా టీటీడీ యాజమాన్యం, కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. వారికి ఏడు నెలల నుంచి ఉపాధి లేదని, కుటుంబాల పోషణ కష్టంగా మారిందని తెలిపారు. టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు, ఈవో శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి స్పందించి చిరు వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల యూనియన్ అధ్యక్షుడు చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి మధు, యుగంధర్, చిరంజీవి, రాంబాబు, ప్రకాష్, గోపి, మల్లి, రామమూర్తి, పెంచలయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనధికార హాకర్ల తరలింపు



అనుమానితులను తిరుపతికి తరలిస్తున్న పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

తిరుమల : తిరుమలలోని అనధికార హాకర్లను తిరుపతికి పోలీసులు, విజిలెన్స్ అధికారులు తరలిస్తున్నారు. సాక్షి పత్రికలో ఈ నెల 21వ తేదీన ×ఇల వైకుంఠపురం.. ఇదేం అపచారం౯ శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు పోలీసులు రంగంలోకి దిగి తిరుమలలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఇప్పటి వరకు 71 మంది అనధికార హాకర్లు, కూలీలు, ఇతర అనుమానితులను గుర్తించి తిరుపతికి పంపేశారు. ప్రతి ఒక్కరి గుర్తింపు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వీరిలో ఎవరైనా పాత నేరస్తులు ఉన్నారా అని తనిఖీ చేశారు. ఆదివారం ఈ మేరకు తిరుమలలోని పాచికాల్వ గంగమ్మ ఆలయం వద్ద తాత్కాలిక షెడ్లను తొలగించారు.

ఎమ్మెల్యేకు స్వాగతం.. విద్యార్థుల వాయిద్యం



బ్యాండు వాయిస్తున్న విద్యార్థులు

చిల్లకూరు: మండలంలోని బల్లవోలులో కూటమి నేతలు ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభించేందుకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆదివారం గ్రామానికి విచ్చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేకు స్వాగతం పలికేందుకు స్థానిక పాఠశాల విద్యార్థులను నియమించారు. పిల్లలతో బ్యాండు వాయించేలా కూటమి నేతలు చర్యలు చేపట్టడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు.

రెండు లారీలు ఢీ



ఘటనాస్థలంలో కంటైనర్లు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట రమణ విలాస్ సర్కిల్‌లో ఆదివారం రెండు కంటైనర్ లారీలు ఢీకొన్నాయి. చెన్నై వైపు నుంచి కడప దిశగా వెళుతున్న హెవీ లారీలు ఒకదానికొకటి ఓవర్ టేక్ చేసే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రేణిగుంట పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని వెల్లడించారు.

ఎర్రావారిపాళెం ఎస్ఐ బదిలీ

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చంద్రగిరి నియోజక వర్గం ఎర్రావారిపాళెం ఎస్ఐ ఎర్రిస్వామి బదిలీపై కర్నూలుకు వెళ్లారు. కూటమి నేతల ఒత్తిడిని భరించలేకే ఆయన బదిలీ చేయించుకున్నట్లు స్థానికులు చర్చించుకుంటుండడం గమనార్హం.



తంతి పందిరి వద్ద ఫారెస్ట్ చెక్‌పోస్ట్



దిగువ శీతాలంలో జలపాతం

స్వచ్ఛమైన గాలి.. పరిశుభ్రమైన నీరు.. పచ్చటి అడవి.. శ్రవణానందంగా పక్షుల కిలకిలరావాల.. ఎత్తైన కొండలు.. సహజసిద్ధంగా ఏర్పడిన జలపాతం.. నిరంతరం ప్రవహించే సెలయేరుతో పర్యాటక స్వర్గధామంగా ఉబ్బల మడుగు విలసిల్లుతోంది. ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకర్షిస్తోంది. సందర్శకులకు మరుపునాని మధురానుభూతులను పంచుతోంది. ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి పథంలోకి పయనిస్తోంది. ప్రజలకు ఆహ్లాదంతోపాటు విజ్ఞానం పంచేందుకు సన్నద్ధమవుతోంది.

పర్యాటకం.. పరవశం

- సందర్శకులను ఆకర్షిస్తున్న ఉబ్బల మడుగు
- ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామం
- ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి

వరదయ్యపాళెం: కాంబాకం రిజర్వు ఫారెస్టులో ఉబ్బలమడుగు పర్యాటక కేంద్రంగా సందర్శకులను ఆకట్టుకుంటోంది. వరదయ్యపాళానికి 10 కిలో మీటర్ల దూరంలో ఒకరోజు విహారయాత్రకు ఇది చక్కటి ప్రదేశం.

చూడాల్సిన ప్రాంతాలు

వరదయ్యపాళెం నుంచి 7కి.మీ ప్రయాణిస్తే అవంతి ఫ్యాక్టరీ వస్తుంది. దీన్ని దాటితే రిజర్వు ఫారెస్టు మొదలవుతుంది. అడవి మొదట్లో తెలుగుగంగ కాలువ, టోల్ గేట్ ఉంది. ఈ ప్రాంతం నుంచి సుమారు 12 కి.మీలలో సెలయేరు నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. ఆ పక్కనే వరసగా తంతి పందిరి, దొరమడుగు, సీతలమడుగు, తంగశాల, పెద్దక్కమడుగు, ఉబ్బలమడుగు, సిద్ధేశ్వరగుడి, సద్దికూటిమడుగు, అంజూరుగంగ, దోగుడుబండ జలపాతాలు ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని సీతాళం అని పిలుస్తారు. సిద్ధేశ్వరగుడి నుంచి 3కిలోమీటర్లు కొండపై ప్రయాణించడం కష్టసాధ్యం కావడంతో పర్యాటకులు ఉబ్బలమడుగుకే పరిమితవుతుంటారు. ఈ ప్రాంతాలను సందర్శించడానికి అటవీశాఖ నామమాత్రపు రుసుముతో సహాయకులను ఏర్పాటు చేసింది.

ఆహ్లాదం.. విజ్ఞానం

పర్యాటకులకు ఆహ్లాదంతో పాటు విజ్ఞానం అందించే దిశగా అటవీశాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఉబ్బల మడుగును ఎకో టూరిజంగా తీర్చిదిద్దుతోంది. ఈ క్రమంలోనే చెట్లు, వాటి శాస్త్రీయ నామాలు తదితర విశేషాలతో దారి పొడవునా సూచిక బోర్డులను ఏర్పాటు చేసింది. రాజులు వాడిన ఫిరంగి, టన్ను బరువుండే తిరగలి, పూసలదిబ్బ, ఎలిజబెత్ రాణి బంగ్లా, పాలేగాళ్ల, వారి తోటలు ఇలాంటి విశేషాలన్నీ పర్యాటకులు తెలుసుకోవాల్సినవే.

తంతిపందిరి (తన్నీర్ పందల్) : బ్రిటీష్ హయాంలో చేపల పెంపకం కోసం ఎంపిక చేసిన ప్రాంతమే ఈ తన్నీర్ పందిల్, ఇప్పుడు తంతిపందిరిగా మారింది. వరదయ్యపాళెం నుంచి ఇక్కడ వరకు వెళ్లేందదుకు తారు రోడ్డు ఉంది. ఉబ్బలమడుగు వరకు వెళ్లలేని వారు ఇక్కడి మడుగులోనే సేద తీరుతుంటారు.

ఎన్నో మడుగులు : తంతి పందిరి నుంచి 3కిలోమీటర్లు దూరంలో ఉబ్బలమడుగు ఉంది. వాహనల్లో వెళ్లుందుకు గ్రావెల్ మార్గం నిర్మించారు. ఇక్కడే దొరమడుగు, మామిడి చెట్ల మడుగు, తంగశాల మడుగు, వూలమడుగు, చద్దికూటి మడుగులున్నాయి. శివరాత్రి పర్వదినం రోజున ఆర్‌టీసీ ప్రత్యేక సర్వీసులను నడుపుతుంది. మిగిలిన రోజుల్లో ఆటోలు నడుస్తుంటాయి.

ఎగువ శీతాలం : సువూరు 300అడుగుల నుంచి పడుతున్న జలపాతం. పక్కనే లోతైన నీటి వుడుగు. గొడుగులా ఇరువైపులా వ్యాప్తించి వుండే కొండవంపు. ఇది చాలా అందమైన ప్రాంతం. తెలుగు చిత్రసీవుకు వుద్రాసు కేంద్రంగా వున్నప్పుడు ఎక్కువగా ఉబ్బలవుడుగులో షూటింగులు జరిగేవి.

సిద్దులకోన : పూర్వం మునులు ఈ ప్రాంతంలో తపస్సు చేసేవారు. అందుకే దీనికి సిద్దులకోన అనే పేరు వచ్చింది. ఇక్కడకు వెళ్లాలంటే ట్రాక్టరు వంటి వాహనాలు లేదా, కాలినడకన 2కి.మీ వెళ్లాల్సి ఉంటుంది. భక్తులు పక్కనే ఉన్న సిద్దుల మడుగులో స్నానాలు ఆచరించి సిద్ధేశ్వరస్వామిని దర్శించుకుంటారు.

దిగువశీతాలం : లోతైన మడుగులు, నిలువెత్తు జలపాతాలకు నెలవు ఈ దిగువశీతాలం. రెండు కొండ చరియల నడుమ ఉండే ఈ ప్రాంతాల్లో ఎటు చూసినా తేనెతుట్టెలు కనిపిస్తుంటాయి. సిద్దులకోన నుంచి కొండబండల నడుమ 2కి.మీ దూరం కాలినడకన దిగువశీతాలం వెళ్లాల్సి ఉంటుంది. ఇక్కడున్న నీటి మడుగులు రెండు తాటిచెట్లకు పైగా లోతున్నా నీరు స్వచ్ఛంగా ఉండడంతో లోపలి రాళ్లు సైతం కనిపిస్తూ పర్యాటకులను తికమకకు గురిచేస్తాయి. మడుగులోకి దిగితే ఎంత వేసవిలోనైనా నీరు చల్లగా ఉంటూ వణికిస్తాయి..



కొలనులో సేదతీరుతున్న పర్యాటకులు



వ్యూ పాయింట్

మరిన్ని వసతులు

"ఉబ్బలమడుగు వచ్చే సందర్శకులకు మరిన్ని వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా జలపాతాల వద్ద బోటింగ్ పార్క్‌లు, మరో వ్యూ పాయింట్, విశ్రాంత గదులు నిర్మాణానికి ఏపీ టూరిజంతో కలసి ప్రతిపాదనలు పంపించాం. – త్రినాథ్ రెడ్డి, ఎఫ్ఆర్ఓ, సత్యవేడు

'స్కావెంజర్స్' జోలికి వస్తే యుద్ధమే!

- వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి



భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతి నగర ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు నివసిస్తున్న స్కావెంజర్స్ కాలనీ జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం కోసం తమ ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్న పారిశుద్ధ్య కార్మికులను ఇబ్బంది పెట్టాలని చూస్తే ఉద్యమం కాదని, యుద్ధమే చేస్తామని స్పష్టం చేశారు. నగర నడిబొడ్డులోని 4.61ఎకరాల విస్తీర్ణంలో స్కావెంజర్స్ కోసం కాలనీ ఏర్పాటు చేశారన్నారు. సుమారు 70 ఏళ్లుగా ఈ కాలనీలో పారిశుద్ధ్య కార్మికులు నివసిస్తున్నారని వెల్లడించారు. వీరికి అక్కడే శాశ్వతంగా ఇల్లు నిర్మించాలని గతంలో అనేక ప్రతిపాదనలు చేసినట్లు వివరించారు. అయితే 2014–19 మధ్య నాటి టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి నారాయణ కుట్రపూరితంగా స్కావెంజర్స్‌కాలనీని ప్రైవేట్ కంపెనీలకు అప్పజెప్పేందుకు చర్యలు చేపట్టారని ఆరోపించారు. దీనిపై అప్పట్లోనే భూమన కరుణాకర రెడ్డితో పాటు వామపక్ష నాయకులు ఉద్యమాలు చేపట్టారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం 4.61ఎకరాల స్కావెంజర్స్‌కాలనీ విలువ సుమారు రూ. 120కోట్లకు చేరిందని తెలిపారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం దురాలోచనతో పారిశుద్ధ్య కార్మికులను తరిమేసి, స్కావెంజర్స్‌కాలనీని ప్రైవేట్ కంపెనీలకు అప్పగించేందుకు కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. అందులో భాగంగానే ఆ ప్రాంతంలో సర్వేలు చేపడుతోందన్నారు. తిరుపతిలో పారిశుద్ధ్యం మరింత మెరుగుపరిచేందుకు టీటీడీ సహకారంతో 1,700 మంది కార్మికులను ఆదనంగా తీసుకోవాలని నిర్ణయించామని, అప్పట్లో బీజేపీనేత భాను ప్రకాష్‌రెడ్డి కోర్టుకెళ్లి అడ్డుకున్నారని వెల్లడించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కార్మికులకు అన్యాయం జరుగుతుంటే భానుప్రకాష్‌రెడ్డి ఎందుకు కోర్టుకు వెళ్లలేదని ప్రశ్నించారు. స్కావెంజర్స్ కాలనీ నుంచి కార్మికులను తరిమేయాలని చూస్తే పోరాటం తప్పదని హెచ్చరించారు.

చంద్రగిరి 'కూటమి'లో విభేదాలు



బోసిబోయిన ర్యాలీలో జనసేన ఎమ్మెల్యేలు, నేతలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల్లోనే టీడీపీ, జనసేన, బీజేపీ నేతల్లో విభేదాలు మొదలయ్యాయి. ఆదివారం చంద్రగిరిలో జనసేన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో నేతల నడుమ పొరపొచ్చాలు బహిర్గతమయ్యాయి. చంద్రగిరి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దేవర మనోహర్ ఆధ్వర్యంలో కార్యాలయం ప్రారంభించేందుకు సన్నాహాలు చేశారు. ఈ మేరకు కూటమి ప్రజాప్రతినిధులు, నేతలను ఆహ్వానించారు. ఈ మేరకు పట్టణంలో కూటమి నేతల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

8 గంటలకు అని చెప్పినా..!

పార్టీ కార్యాలయాన్ని ఉదయం 8 గంటలకు ప్రారంభించనున్నట్లు జనసేన నేతలు తొలుత ప్రకటించారు. అయితే మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా టీడీపీ, బీజేపీ నాయకులు కనిపించకపోవడంతో జనసేన నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక చేసేది లేక తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్‌తో కలిసి కొత్తపేటలోని పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి, కార్యాలయం ప్రారంభించారు.

ఇంటికెళ్లి పిలిచినా..!

జనసేన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి రావాలంటూ టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఇంటికెళ్లి జనసేన నేతలు ఆహ్వానించినట్లు సమాచారం. అయినప్పటికీ ఆయన ముఖం చాటేయడంపై జనసేన కార్యకర్తలు మండిపడుతున్నారు.

దృఢ సంకల్పమే విజయానికి ఆయుధం



మాట్లాడుతున్న తూర్పుగోదావరి జిల్లా జేసీ, ఎస్వీయూ పూర్వ విద్యార్థి రాహుల్ కుమార్ రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ, ఈసీఈ విభాగం అధ్యాపకులు

- ఎస్వీయూ పూర్వ విద్యార్థి, ఈస్ట్ గోదావరి జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి
- ఎస్వీయూలో ఘనంగా సిగ్మాండ్–2025 ఫెస్ట్

తిరుపతి సిటీ : దృఢ సంకల్పం ఉంటే జీవితంలో లక్ష్యాన్ని చేరుకోవచ్చని, దృఢ సంకల్పమే ఆయుధంగా ముందుకు సాగాలని ఎస్వీయూ పూర్వ విద్యార్థి, తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం సిగ్మండ్–2025 ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ఇందులో ఆయన వర్చువల్ విధానంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను ఎస్వీయూలో ఈసీఈ విభాగంలో 2012లో ఇంజినీరింగ్ పూర్తి చేశానని తెలిపారు. సివిల్స్ లక్ష్యంగా శ్రమించానని, పలు ప్రయత్నాల్లో విఫలమైనా ఆత్మ విశ్వాసాన్ని వదలలేదన్నారు. తర్వాత తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నానని తెలిపారు. ప్రతి ఒక్కరికీ విద్యార్థి దశ కీలకమన్నారు. ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో నిపుణులైన అధ్యాపకులకు కొదవలేదన్నారు. వారి సూచనల మేరకు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఐఏఎస్ అధికారి మాటలతో స్ఫూర్తి పొందిన విద్యార్థులు

తమ కళాశాలలో చదివి ఐఏఎస్‌గా ఎంపికైన రాహుల్ కుమార్‌రెడ్డి మాటలతో ఈసీఈ విభాగం విద్యార్థులు స్ఫూర్తి పొందారు. ఆయన విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సావధానంగా సమాధానం ఇచ్చారు. సందేహాలను నివృత్తి చేశారు. విఫలం చెందామని నిరుత్సాహపడకుండా ముందుకు సాగితే లక్ష్యం కాళ్ల వద్దకు చేరుతుందన్నారు. సివిల్స్ కష్టసాధ్యమైన పరీక్ష అంటూ సమాజంలో ఎంతో మంది వెనుకడుగు వేస్తారని, అది సత్యదూరమన్నారు.

ఎస్వీయూ విద్యార్థి ఐఏఎస్ సాధించడం గర్వకారణం

వీసీ అప్పారావు మాట్లాడుతూ ఎస్వీయూ ఈసీఈ విభాగం పూర్వ విద్యార్థి రాహుల్ కుమార్‌రెడ్డి ఐఏఎస్ సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో శ్రమించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు, ఈసీఈ విభాగం హెడ్ స్వర్ణలత, కన్వీనర్ ప్రొఫెసర్ వరదరాజన్, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ రామ్ హర్షన్, వర్షిత, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి యువకుడి మృతి

వెంకటగిరి రూరల్ : బెంగళూరు నుంచి కాకినాడ వెళుతున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ఆదివారం రాత్రి వెంకటగిరి స్టేషన్‌లో జారి పడి గుర్తుతెలియని యువకుడు (24) మృతి చెందాడు. మృతుడి ఒంటిపై తెలుపు టీషర్ట్, బ్లూ జీన్స్‌ఫ్యాంట్ ఉంది. సమాచారం అందుకున్న గూడూరు రైల్వే ఇన్‌చార్జి ఎస్ఐ మాల కొండయ్య ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ బోల్తాపడి ఉపాధ్యాయుడి మృతి



శివకేశవులు (ఫైల్)

రామచంద్రాపురం (తిరుపతి రూరల్): రామచంద్రాపురం మండలంలోని చిట్టతూరు సమీపంలో శనివారం రాత్రి బైక్ బోల్తాపడి ఉపాధ్యాయుడు శివకేశవులు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. శివకేశవులు కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ మాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన శనివారం రాత్రి బైక్‌లో పచ్చికాపలం నుంచి స్వగ్రామమైన చిట్టతూరు గ్రామానికి బయలుదేరారు. చిట్టత్తూరు సమీపంలో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. తలకు బలమైన గాయాలు కావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. శివకేశవులు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. హిందీ టీచర్ మృతి విషయం తెలుసుకున్న కమ్మపల్లి జెడ్పీ హైస్కూల్ పిల్లలు పెద్ద సంఖ్యలో చిట్టత్తూరు చేరుకున్నారు. ఆయన భౌతిక దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీకొందా అన్న కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చిట్టి చేతుల..'స్వచ్ఛాంధ్ర'



జీఎన్‌కండ్రిగ దళితవాడలో మురుగు, వ్యర్థాలను తొలగిస్తున్న చిన్నారులు

నారాయణవనం: ''స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్రతో గ్రామాలు, మురుగుకాల్వలు శుభ్రంగా ఉండాలి.. ముందస్తు సమాచారం లేకుండా నేనే స్వయంగా గ్రామానికి వస్తాను.. పరిశుభ్రత లేకుంటే చర్యలు తప్పదు..'' అన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటలను అధికార యంత్రాంగం పట్టించుకోవడమూ లేదు. సమస్యలను గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా స్పందించిన పాపానపోవడం లేదు. చివరకు విసిగి వేసారిన బాలలే నడుం బిగించి కదిలారు. పలకా బలపం, పుస్తకాలకు బదులు పారలు చేత బట్టారు. మురుగు కాలువలో దిగి, దుర్గంధం నడుమ వ్యర్థాలను తొలగించారు. ఆ పనుల మూలాన ఆ చిట్టి చేతులు, ఒంటికి, దుస్తులకు అంటిన కాలువ మురుగు కంపుతోనే ఇళ్లకు వెళ్లి స్నానం చేశారు. వివరాలు.. మండలంలోని గోవిందప్పనాయుడు కండ్రిగ దళితవాడ పాఠశాల సమీపంలో మురుగు కాలువ పారకుండా వ్యర్థాలతో నిండిపోయింది. అధికారులకు ఈ సమస్యపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో చివరకు బడి పిల్లలే ముందుకు కదిలారు. ఆదివారం ఆ ప్రాంతాలను శుభ్రం చేసి అధికారుల అలసత్వానికి చెంపపెట్టులా చేతల్లో చూపారు. ప్రజాప్రతినిధులను అడ్డం పెట్టుకుని పంచాయతీ కార్యదర్శి విధులకు డుమ్మా కొడుతూ దురుసుగా పెత్తనం చేస్తున్నాడన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు మురుగు శుభ్రం చేయడంపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి!

విహారయాత్రలో విషాదం

- చెట్టును ఢీకొన్న కారు
- ఇద్దరి మృతి, ఆరుగురికి గాయాలు



నుజ్జునుజ్జయిన కారుని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్) మృతి చెందిన ఫాతిమా

తడ : చెన్నై– నెల్లూరు జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ కొండపనాయుడు కథనం మేరకు.. చెన్నై ఇంజినీరింగ్ కళాశాలలో బీసీఏ మూడో సంవత్సరం విద్యార్థులు ఆదివారం వరదయ్యపాళెం సమీపంలోని ఉబ్బల మడుగు విహారయాత్రకు బయలుదేరారు. ఇందుకోసం ఓ కారుని అద్దెకు తీసుకుని డ్రైవర్‌తోపాటు 8 మంది తాంబరం నుంచి బయలుదేరారు. పెరియవట్టు గ్రామం వద్ద వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు దిగేసి చెట్టును ఢీకొంది. ప్రమాద సమయంలో కారు ముందు సీటులో ఉన్న సంబ్రిన్ ఫాతిమా(21) ఘటనా స్థలంలోనే మృతి చెందింది. మిగిలిన వారికి తీవ్ర గాయాలు కావడంతో తమిళనాడుకు చెందిన 108 అంబులెన్స్‌లో తొలుత ఎళావూరు ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నై స్టాన్లీ ఆస్పత్రికి తీసుకెళుతుండగా దిన(34) అనే మరో వ్యక్తి మృతి చెందాడు. కారు నడుపుతున్న మహమ్మద్ ఆవాజ్(26)తోపాటు యోగేశ్వరన్(20), బెంజమిన్(26), అలియా బేగమ్(23), శ్రీమాన్(20), మాదేష్(21) గాయపడ్డారు. ఫాతిమా మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దిన మృతదేహాన్ని స్టాన్లీ ఆస్పత్రిలోనే ఉంచారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

లారీని ఢీకొన్న బస్సు

– 15 మంది గాయాలు



ధ్వంసమైన బస్సు

వెంకటగిరి రూరల్ : రేణిగుంట సెజ్‌లోని కార్బన్ లియోలింక్ కంపెనీకి చెందిన బస్సు వెంకటగిరి పరిసర ప్రాంతాలకు చెందిన తమ ఉద్యోగులతో వెళుతూ ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ఆదివారం వేకువజామున శ్రీకాళహస్తి రూరల్ మండలం ఎంపేడు గ్రామం వద్ద ఈ ప్రమాదం జరిగింది. ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొన్నట్లు . శ్రీకాళహస్తి రూరల్ ఎస్ఐ నరసింహారావు వెల్లడించారు. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ మునేంద్రతోపాటు, రాపూరుకి చెందిన యశోద, వెంకటగిరికి చెందిన కుషల్, గొట్లగుంటకు చెందిన ప్రసాద్, లింగసముద్రానికి చెందిన శివాజీతోపాటు మొత్తం 15 మంది గాయపడ్డారు. రాయచోటికి చెందిన లారీ క్లీనర్ రాజు సైతం తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రులను 108 వాహనంలో వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు మెరుగైన చిక్సి కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ వివరించారు.

నేడు సూళ్లూరుపేటకు చేరుకోనున్న సైక్లోథాన్ యాత్ర



సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది చేపట్టిన సైక్లోథాన్ యాత్ర

సూళ్లూరుపేట : కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) చేపట్టిన సైక్లోథాన్ యాత్ర సోమవారం ఉదయం సూళ్లూరుపేటకు చేరుకోనుంది. అక్కడి నుంచి 9 గంటలకు తడ మండలం అండగుండాల, కారిపాకం వెళ్లే రోడ్డులో ఉన్న జైన్ మందిరం వద్దకు చేరుకుంటుంది. ×జాతీయ తీర ప్రాంతాల భద్రత, సమాజ నిబద్ధత౯ అనే అంశంపై జనానికి అవగాహన కల్పించేందుకు సుమారు వంద మంది సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది 9 రాష్ట్రాల మీదుగా 6,553 కి.మీ సైకిల్ యాత్రను చేపట్టారు. ఈ యాత్రను ఈనెల 7న కోలకత్తాలో కేంద్ర హోమ్‌శాఖ మంత్రి అమిత్‌షా ప్రారంభించారు. ఈ యాత్ర ఏప్రిల్ 1 నాటికి కన్యాకుమారిలో ముగియనుంది. సోమవారం సూళ్లూరుపేట ఈ యాత్రకు శ్రీహరికోట రాకెట్ కేంద్రంలోని సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది స్వాగతం పలకనున్నారు. కార్యక్రమానికి షార్ డైరెక్టర్, కంట్రోలర్, సీఐఎస్ఎఫ్ ఐజీ సౌత్ సెక్టార్, డీఐజీ, స్థానిక పోలీస్ అధికారులు, ఎన్‌సీసీ క్యాడెట్స్, విద్యార్థులు హాజరుకానున్నారు.

నాయుడుపేటకు చేరుకున్న సైక్లోథాన్ ర్యాలీ

నాయుడుపేట టౌన్: కోల్‌కత్తా నుంచి ప్రారంభమైన సీఐఎస్ఎఫ్ కోస్టల్ సైక్లోథాన్ ర్యాలీ ఆదివారం సాయంత్రం నాయుడుపేట మండల పరిధిలోని బిరదవాడ గ్రామ సమీపంలోని శ్రీనివాసపురం వద్దకు చేరింది. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబుతో పాటు సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి, పాఠశాల విద్యార్థులు, మహిళలు సీఐఎస్ఎఫ్ జవాన్లపై ఘన స్వాగతం పలికారు.